


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | శనివారం, 30-09-2023 | సంపుటి : 06 | సంచిక : 30 | పేజీలు : 8 | వెల : రూ 3-00

## హైదరాబాద్ చుట్టుపక్కల జిల్లాల్లో భారీ వర్షాలు: వాతావరణ కేంద్రం



హైదరాబాద్: తెలంగాణలో రానున్న మూడు రోజులు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఇవాళ పలుచోట్ల మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు పడతాయని తెలిపింది. హైదరాబాద్ చుట్టుపక్కల జిల్లాలైన సిద్దిపేట, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, మహబూబ్ నగర్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. భారీ వర్షాలు పడేందుకు అవకాశం ఉన్నందున నాలుగు రోజుల పాటు ఎల్లో హెచ్చరికలు జారీ చేసినట్లు వెల్లడించింది. ఈశాన్య పరిసర ప్రాంతాల్లోని తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఇవాళ అల్పపీడనం ఏర్పడినట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. దీనికి అనుబంధంగా ఉన్న ఆవర్తనం సగటు సముద్ర మట్టం నుంచి 7.6 కి.మీ. ఎత్తు వరకు వ్యాపించిందని తెలిపింది.

## నా నియోజకవర్గానికి నిధులు ఇవ్వడం లేదు: హైకోర్టులో సీతక్క పిటిషన్



హైదరాబాద్: ములుగు నియోజకవర్గానికి సీడీఎఫ్ నిధులు విడుదల చేయడం లేదంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యే సీతక్క హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు ఆమె పిటిషన్ దాఖలు చేశారు. నిధుల మంజూరులో ప్రభుత్వం వివక్ష చూపుతోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉన్నందున తన నియోజకవర్గానికి నిధులు ఇవ్వడం లేదని.. సీడీఎఫ్ నిధుల మంజూరులో జిల్లా మంత్రి ప్రమేయం చట్ట విరుద్ధమన్నారు. జిల్లా మంత్రి ఆమోదంతో నిధులు మంజూరు చేయాలన్న జీవోను కొట్టేయాలని హైకోర్టుకు సీతక్క విజ్ఞప్తి చేశారు. సీతక్క పిటిషన్‌పై ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను హైకోర్టు అక్టోబర్ 9కి వాయిదా వేసింది.

# మా పాలనలో మంచి జరిగిందనుకుంటే మాకు తోడుగా నిలవండి : సీఎం జగన్







విజయవాడ: త్వరలో కురుక్షేత్ర యుద్ధం జరగబోతుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. నిరుపేదల వైపు నిలబడిన ప్రభుత్వానికి, పేదలను వంచించిన గత ప్రభుత్వానికి మధ్య యుద్ధం జరగబోతుందని తెలిపారు. పేదలకు, పెత్తందారులకూ మధ్య యుద్ధం జరగనుందని పేర్కొన్నారు. అమరావతి పేరుతో స్కామ్, స్కిల్ స్కామ్, ఇన్నర్ రింగ్ రోడ్డు, ఫైబర్ గ్రిడ్, నీరు-చెట్టు పేరుతో దోపిడీ చేసిన వారితో యుద్ధం జరగబోతుందని మండిపడ్డారు. ఈ మేరకు విజయవాడలో వరుసగా అయిదో ఏడాది వాహనమిత్ర నిధులను సీఎం జగన్ శుక్రవారం విడుదల చేశారు. వాహనమిత్రతో ఆటో డ్రైవర్లు, ట్యాక్సీ డ్రైవర్లకు లబ్ధి పొందుతుండగా.. 2,75,931 మంది ఖాతాల్లోకి రూ. 10 వేల చొప్పున జమచేశారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. 99శాతం హామీలు అమలు చేశామని తెలిపారు. మన ప్రభుత్వం వాయిస్ ఆఫ్ ది వాయిస్ లెస్ అని పేర్కొన్నారు. ఒకవైపు పేదల ప్రభుత్వం ఉంటే మరోవైపు పేదల్ని మోసగించిన వారు ఉన్నారని విమర్శించారు. 'మన ప్రభుత్వం మనసున్న ప్రభుత్వం. గత పాలకులకు మనసు లేదు. పేదల కోసం పనిచేస్తున్న ప్రభుత్వం మనది. మేనిఫెస్టోలో చెప్పిన ప్రతీ హామీని అమలు చేశాం. మేనిఫెస్టోను చెత్తబుట్టలో వేసిన ప్రభుత్వం గత ప్రభుత్వం. లంచం, వివక్ష లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమచేశాం. గతంలోనూ ఇదే బడ్జెట్, మారిందల్లా సీఎం ఒక్కడే. గతంలో ఎందుకు ఈ పథకాలు ఇవ్వలేకపోయారు? పేదవాడి ప్రభుత్వం నిలబడాలి. పెత్తందారుల ప్రభుత్వం రాకూడదు. వచ్చే ఎన్నికలప్పుడు వీటన్నింటి గురించి ఆలోచించాలని సూచించారు. వాళ్లకు అధికారం కావాల్సింది దోచుకోవడానికి, దోచుకున్నది పంచుకోవడానికి.. వాళ్లలాగా నాకు దత్తపుత్రుడి తోడు లేదు. వాళ్లు మాదిరిగా నాకు గజదొంగల ముఠా తోడుగా లేదు. దోచుకొని పంచుకొని తినడం నా విధానం కాదు. మీ ఇంట్లో మంచి జరిగిందనిపిస్తే నాకు తోడుగా నిలవండి. ఈ కురుక్షేత్ర యుద్ధంలో నాకు అండగా నిలబడండి. ఓటు వేసే ముందు జరిగిన మంచి గురించి ఆలోచించండి.' అని సీఎం జగన్ పేర్కొన్నారు.

## బాబు బెయిల్ పిటిషన్‌పై

# విచారణ వాయిదా



అమరావతి: ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసులో తెదేపా అధినేత చంద్రబాబు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ అక్టోబరు 3వ తేదీకి వాయిదా పడింది. రెండ్రోజుల క్రితం చంద్రబాబు తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వర్చువల్‌గా వాదనలు వినిపించారు. ఆ తర్వాత సీఐడీ తరఫున ఏజీ శ్రీరామ్ వాదనలు కొనసాగించారు. ఏజీ వాదనలకు లూథ్రా కౌంటరు వాదనలు వినిపిస్తూ.. కేవలం రాజకీయ దురుద్దేశంతోనే సీఐడీ అధికారులు కేసు నమోదు చేశారని కోర్టు దృష్టికి తెచ్చారు. దీంతో తదుపరి వాదనలు కొనసాగించేందుకు విచారణ అక్టోబరు 3కు వాయిదా వేస్తున్నట్టు న్యాయమూర్తి తెలిపారు. రాజధాని నగరానికి సంబంధించిన బృహత్ ప్రణాళిక డిజైనింగ్, ఇన్నర్ రింగ్‌రోడ్డు, దాన్ని అనుసంధానించే రహదారుల ఎలైన్‌మెంట్‌లో అక్రమాలు చోటు చేసుకున్నాయని వైకాపా ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి 2022 ఏప్రిల్ 27న ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా అదే ఏడాది మే 9న సీఐడీ పలువురిపై కేసు నమోదు చేసింది. చంద్రబాబును మొదటి నిందితుడిగా పేర్కొంది. ఈ కేసులో తనకు బెయిలు మంజూరు చేయాలని చంద్రబాబు పిటిషన్ వేశారు.

## దొంగతనం చేసి సానుభూతి కోరుకుంటున్నారు: సజ్జల



అమరావతి: అడ్డంగా దొరికిన దోపిడీ దొంగల ముఠాకు ఎల్లో సపోర్ట్ చేస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఎల్లో మీడియాకు వాస్తవాలతో సంబంధం లేదని, జనం నమ్మక చస్తారా అనేదే ఎల్లో మీడియా ఆలోచన అంటూ దుయ్యబట్టారు. "వీరంతా తోడు దొంగలే.. ఇంతకంటే పెద్ద పదం లేదు. లక్ష మంది గోబెల్స్ కలిస్తే ఒక చంద్రబాబు.. అధికారాన్ని అడ్డంపెట్టుకుని ఇష్టానుసారం దోచుకున్నారు. టీడీపీ అంటే తోడు దొంగల పార్టీ. ముఠా నాయకుడు చంద్రబాబును కాపాడేందుకు ప్రయత్నిస్తున్నారు. స్కాం దర్యాప్తులో ప్రభుత్వ ప్రమేయం లేదు. ప్రస్తుతం కేసు కోర్టు పరిధిలో ఉంది. ఈ 20 రోజుల్లో లోకేశ్ ముఠా నానా యాగీ చేసింది. ప్రజలకు సంబంధించిన సొమ్ము దోపిడీకి గురైంది" అని సజ్జల పేర్కొన్నారు. "సాక్ష్యాధారాలతో దొరికితే కోర్టు రిమాండ్‌కు పంపింది. జరిగిన స్కామ్‌పై వీరంతా మాట్లాడటం లేదు. దొంగతనం చేసి సానుభూతి కోరుకుంటున్నారు. మేధావులు అనుకుంటున్న కొందరితో స్టేట్‌మెంట్లు ఇప్పిస్తున్నారు. చంద్రబాబు అరెస్ట్‌ను దేశ సమస్యలా చిత్రీకరిస్తున్నారు" అంటూ సజ్జల రామకృష్ణారెడ్డి ధ్వజమెత్తారు.

# వైఎస్సార్ వాహన మిత్ర పధకం 8892 మందికి 8,89,20,000 కోట్ల రూపాయిల జమ

### జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్



నంద్యాల మా ప్రతినిధి , సెప్టెంబర్ 29 విభారె న్యూస్ :వైఎస్సార్ వాహన మిత్ర పథకం కింద నంద్యాల జిల్లాలో 8892 మంది లబ్ధిదారులకు 8 కోట్ల 89 లక్షల 20 వేల రూపాయలు పంపిణీ చేసామని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజిర్ జిలాని సమూన్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి విజయవాడలోని విద్యాధరపురం నుండి వరుసగా ఐదో ఏడాది వైఎస్సార్ వాహన మిత్ర పథకం క్రింద రాష్ట్రవ్యాప్తంగా 2,75,931 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 10 వేల రూపాయల చొప్పున 275.93 కోట్ల రూపాయల ఆర్థిక సాయాన్ని బటన్ నొక్కి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసే కారక్రమాన్ని లైవ్ ద్వారా ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్, నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, మైనారిటీ సంక్షేమ ప్రభుత్వ సలహాదారుడు డీఎస్ హాబీబుల్లా, రాష్ట్ర దృశ్య కళల డైరెక్టర్ సునీత అమృత రాజ్, జిల్లా రవాణా అధికారి జి.వి. శివారెడ్డి తదితరులు వీక్షించారు. అనంతరం జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్ మాట్లాడుతూ జిల్లాలోని ఆటో, ట్యాక్సీ, ఎండియూ ఆపరేటర్లు, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు ప్రభుత్వం అండగా ఉంటూ వారు సకాలంలో ఇన్సూరెన్స్, అవసరమైన రిపేర్లు చేయించుకునేందుకు వైయస్సార్ వాహన మిత్ర పథకం కింద వరుసగా ఐదో ఏడాది మొత్తం 8892 మంది లబ్ధిదారులకు 8 కోట్ల 89 లక్షల 20 వేల రూపాయలను రాష్ట్ర ముఖ్యమంత్రి కంప్యూటర్ బటన్ నొక్కి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారన్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 1194 లబ్ధిదారులకు 1,19,40,000/- బనగానపల్లె నియోజకవర్గంలో 1074 లబ్ధిదారులకు 1,07,40,000/- డోన్ నిజకవర్గంలో 1221 లబ్ధిదారులకు 1,22,10,000/- నందికొట్కూరు నియోజకవర్గంలో 1565 లబ్ధిదారులకు 1,56,50,000/- నంద్యాల నియోజకవర్గంలో 1862 లబ్ధిదారులకు 1,86,20,000/- పాణ్యం నియోజకవర్గంలో 554 లబ్ధిదారులకు 55,40,000/- శ్రీశైలం నియోజకవర్గంలో 1422 లబ్ధిదారులకు 1,42,20,000/-వెరసిమొత్తం8892మందిలబ్ధిదారులకు 8,89,20,000/- రూపాయిలు జమచేశారన్నారు. నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానంద రెడ్డి మాట్లాడుతూ సొంత వాహనం కలిగి వున్న ఆటో, టాక్సీ, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు ప్రతి సంవత్సరం ఒక్కొక్కరికి పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందించడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. ఎమ్మెల్సీ ఇషాక్ బాషా మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చడమే రాష్ట్ర ముఖ్యమంత్రి ఆశయమన్నారు. ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఐదు విడతల్లో ఆటో ట్యాక్సీ, మ్యాక్సీ డ్రైవర్లకు 1301.89 కోట్ల రూపాయలను వాహన మిత్ర పథకం ద్వారా ఆర్థిక సహాయం అందించిందన్నారు. అనంతరం అన్ని నియోజకవర్గాల నుండి వచ్చిన ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లు, ఎండియూ ఆపరేటర్లకు 8,89,20,000 రూపాయల మెగా చెక్కును పంపిణీ చేశారు.

# జిల్లాలో 12,474 డ్రైవర్ల ఖాతాలకు వైఎస్సార్ వాహన మిత్ర పంపిణి

### వెల్లడించిన జిల్లా కలెక్టర్ డాక్టర్. సృజన.



కర్నూలు సెప్టెంబరు 29 విభారె న్యూస్. వైఎస్సార్ వాహన మిత్ర పథకం ద్వారా జిల్లాలోని 12,474 ఆటో, టాక్సీ, మ్యాక్సీ, క్యాబ్, యండియు డ్రైవర్లకు అండగా ఉండేందుకు గాను రూ.12.47 కోట్ల రూపాయలను వారి ఖాతాలలోకి రాష్ట్ర ప్రభుత్వం జమ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ డా.జి.సృజన తెలిపారు. విజయవాడ విద్యాధరపురం నుండి వైఎస్సార్ వాహన మిత్ర పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2,75,931 మంది ఆటో, టాక్సీ, మ్యాక్సీ, క్యాబ్, యండియు డ్రైవర్ల ఖాతాలో ఐదవ విడత ఆర్థిక సహాయంగా రూ.275.93 కోట్ల రూపాయల మొత్తాన్ని బటన్ నొక్కి రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా ప్రజా ప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు తిలకించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలు నుండి ప్రత్యక్ష ప్రసార కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జి.సృజన, కర్నూలు పార్లమెంటు సభ్యులు డాక్టర్ సంజీవ్ కుమార్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్, డిప్యూటీ రవాణా కమిషనర్ కె.శ్రీధర్, ఆర్టీఓ ఎస్.రమేష్ లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.జి.సృజన మాట్లాడుతూ ఆటో, టాక్సీ, మ్యాక్సీ, క్యాబ్, యండియు యజమానులు, డ్రైవర్లు ఎవరి మీద ఆధార పడకుండా సొంతంగా ఆటో కొనుక్కొని తమకు తాము స్వయం ఉపాధిని కల్పించుకుంటూ స్వయం శక్తి మీద ఆధారపడి వారి కుటుంబాలను పోషించుకుంటున్నారని వీరు రోజు లక్షల మందికి ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు క్షేమంగా చేరుస్తున్నారని వీరికి ఆసరాగా ప్రభుత్వం వైయస్సార్ వాహన మిత్ర కార్యక్రమాన్ని అమలు చేస్తోందని ఈరోజు వారి ఖాతాల్లోకి జమ చేసే నగదును కూడా కలుపుకుంటే దాదాపుగా ఒక్కొక్క (మిగతా 2లో )

# సంపాదకీయం

**శనివారం, 30-09-2023**

## భయపెడుతున్న కొత్త వేరియంట్లు

ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా వైరస్ ఏదో ఒక మూలన కొత్త వేరియంట్లతో ప్రజల ముందుకు వస్తూనే ఉంది. అయితే ఇప్పుడు ప్రపంచానికి మరొక వైరస్ ముప్పు పొంచి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇది కోవిడ్ కంటే ఘోరంగా ఉండబోతోందని అంటున్నారు. గతంలో వచ్చిన స్పానిష్ ఫ్లూ మాదిరిగా ఈ కొత్త వైరస్ 50 మిలియన్ల మంది ప్రాణాలని తీసేస్తుందని అంచనా వేస్తున్నారు. మన కంటికి కనిపించకపోయినా అనేక రకాల వైరస్ లు కొత్త రూపాన్ని సంతరించుకుంటూ తిరుగుతూనే ఉన్నాయి. అవన్నీ మానవులకు ముప్పు కలిగించవు. కానీ కొన్ని మహమ్మారిని ప్రేరేపించే వేలాది రకాల వైరస్ లు పరిణామం చెందుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భవిష్యత్తులో కొవిడ్–19 కన్నా భయంకరమైన మహమ్మారి ప్రపంచాన్ని చుట్టుముడుతుందని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. స్పానిష్ ఫ్లూతో కోట్లాది మంది చనిపోయినట్టే, ఈ కొత్త వైరస్ కారణంగా కనీసం 5 కోట్ల మంది ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉన్నదని బ్రిటన్ వ్యాక్సిన్ టాస్క్‌ఫోర్స్‌కు నేతృత్వం వహించిన సైంటిస్టు కేట్ బ్రిఘం హెచ్చరించారు. జంతువుల్లో వైరస్ విస్తరిస్తుందని, మ్యుటేషన్లు ఏర్పడి మానవాళికి పెద్ద సవాల్‌గా మారుతుందని తాను రాసిన ఓ పుస్తకంలో బ్రిఘం వివరించారు. ఈ పుస్తకానికి వ్యాక్సిన్ నిపుణుడు టిమ్ హ్యామ్స్ సహ రచయితగా ఉన్నారు. ‘వేలాది రకాల వైరస్‌ల నుంచి మహమ్మారి ప్రబలేందుకు అవకాశముంది. ఇందులో 25 వైరస్ కుటుంబాలను సైంటిస్టులు గుర్తించారు.ప్రతి కుటుంబంలో వేలాది రకాల వైరస్‌లుంటాయి. దీంట్లో ఏదో ఒక వైరస్ వల్ల మహమ్మారి ప్రబలే అవకాశముంది’ అని టిమ్ హ్యామ్స్, బ్రిఘం తెలిపారు. భవిష్యత్తులో మహమ్మారి రాబోతున్నదని డబ్ల్యూహెచ్‌వో 2018లో హెచ్చరించింది. వైరస్‌ను ‘డిసీజ్ ఎక్స్’గా పేర్కొన్నది. ఎబోలా, హెచ్ఐవీ–ఎయిడ్స్, కొవిడ్–19 వైరస్‌లు తొలుత జంతువుల్లో ప్రవేశించి, ఆ తర్వాత జంతువుల నుంచి మానవులకు సోకాయి. డిసీజ్–ఎక్స్ కూడా అదేవిధంగా ఉండొచ్చునని సైంటిస్టులు భావిస్తున్నారు. అత్యధికంగా మరణాల రేటు కలిగిన ఎబోలా, బర్డ్ ఫ్లూ, మెర్స్.. వైరస్‌లనే అరికట్టాం, రాబోయే మహమ్మారిని సులభంగా ఎదుర్కొనవచ్చునన్న అభిప్రాయాన్ని బ్రిగం, హేమ్స్ కొట్టిపారేశారు.జంతువుల నుంచి, ముఖ్యంగా గబ్బిలాల నుంచి వైరస్‌లు మానవులకు సోకుతుండటంపై పరిశోధనలు చేసి, ‘బ్యాట్‌వుమన్’గా ప్రసిద్ధి చెందిన చైనీస్ వైరాలజిస్ట్ షి ఝెంగ్లి సంచలన హెచ్చరిక చేశారు. భవిష్యత్తులో మరో కొత్త కరోనా వైరస్ పుట్టుకురావొచ్చని, దీనిని ఎదుర్కొనేందుకు ప్రపంచం సిద్ధంగా ఉండాలని తెలిపారు. వుహాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి చెందిన షి బృందం 40 కరోనా వైరస్ జాతుల వల్ల మానవులపై పడే ప్రభావంపై అధ్యయనం చేసింది. వీటిలో దాదాపు సగం వైరస్ జాతులు అత్యంత ప్రమాదకరమైనవని గుర్తించింది.ఇప్పటి వరకు శాస్త్రవేత్తలు 25 రకాల వైరస్ కుటుంబాల గురించి తెలుసుకున్నారు. వాటిలో ప్రతి ఒక్కటి వందలు లేదా వేల మ్యూటేషన్ ని కలిగి ఉన్నాయి. వీటిలో ఏదైనా కూడా మహమ్మారిని కలిగించే అవకాశం ఉందని పరిశోధకులు వెల్లడించారు. కోవిడ్ మహమ్మారి ప్రపంచవ్యాప్తంగా దాదాపు 20 మిలియన్ల మందిని చంపింది. అదృష్టవశాత్తు వైరస్ సోకిన వారిలో ఎక్కువ మంది కోలుకోగలిగారు. ఎబోలా మరణాల రేటు 67 శాతంగా ఉంది. తర్వాత బర్డ్ ఫ్లూ 60 శాతం వచ్చింది. మెర్స్ కూడా 34 శాతం వరకి ప్రజలకి సోకింది. అందుకే కొత్తగా వచ్చే తదుపరి మహమ్మారి ఎలా ఉంటుందో ఊహించడం కష్టమేనని నిపుణులు తెలిపారు. అయితే డబ్ల్యూహెచ్ఓ కి చెందిన నిపుణులు మెక్ కాలీ మాట్లాడుతూ తదుపరి మహమ్మారికి కారణమయ్యేది భయంకరమైన స్పానిష్ ఫ్లూ లాంటిది కావచ్చని హెచ్చరించారు. కోవిడ్ వ్యాప్తి చెందినప్పటి నుంచి శాస్త్రవేత్తలు తదుపరి మహమ్మారికీ కారణమయ్యే ఇతర ప్రమాదకరమైన వైరస్ కోసం శోధిస్తున్నారు. ఇది స్పానిష్ ఫ్లూ మాదిరిగా కేసుల పెరుగుదల, మరణాల సంఖ్య ఉండవచ్చని భావిస్తున్నారు. స్పానిష్ ఫ్లూ అనేది 1918 లో వచ్చింది. ప్రపంచ జనాభాలో మూడింట ఒక వంతు మందికి సోకింది. పక్షుల నుంచి వచ్చిందని అంటారు. 1918 నుంచి 1919 వరకు 50 మిలియన్ల మంది దీని బారిన పడి ప్రాణాలు కోల్పోయారు. ప్రపంచ యుద్ధంలో మరణించిన వారి సంఖ్య కంటే ఈ వైరస్ వల్ల చనిపోయిన వాళ్ళ సంఖ్య రెండు రేట్లు ఎక్కువ. అడవి, పెంపుడు పక్షుల నుంచి ఉద్భవించిందని కొందరు వాదిస్తారు. మరికొందరు పందుల నుంచి వచ్చిందని చెప్తారు. చైనా, ఫ్రాన్స్, యూఎస్, బ్రిటన్ సహ అన్నీ ప్రాంతాలని ఇది కబళించింది.కరోనా వైరస్ మాదిరిగా కాకుండా స్పానిష్ ఫ్లూ యువతలో ముఖ్యంగా ఐదు కంటే తక్కువ వయసు ఉన్న పిల్లలలో, 20–40 సంవత్సరాల వయసు వారికి సోకింది. ఇది అత్యంత శక్తివంతమైనది.

# జిల్లాలో 12,474 డ్రైవర్ల ఖాతాలకు వైఎస్సార్ వాహన మిత్ర పంపిణి

(మొదటిపేజీ తరువాయి...)

కుటుంబానికి 50 వేల రూపాయలు జమ చేయడం జరిగిందన్నారు. ఆటో, టాక్సీ, మాక్సీ, యండియు డ్రైవర్ల వాహనాలకు ఇన్సూరెన్స్, ఫిట్నెస్ సర్టిఫికెట్ లేని కారణంగా చలాన్లు కట్టే పరిస్థితి రాకూడదనే సదుద్దేశంతో వైయస్సార్ వాహన మిత్ర అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. అందుకుగాను ఆటో, టాక్సీ, మాక్సీ, యండియు డ్రైవర్లు వారి వాహనాలకు చెందిన ఫిట్నెస్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్ ఉండేలా చూసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. కర్నూలు పార్లమెంటు సభ్యులు డాక్టర్ సంజీవ్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆటో, టాక్సీ, మ్యాక్సీ, క్యాబ్, యండియు డ్రైవర్ల ఇబ్బందులను గుర్తించి వారి కోసం వైఎస్సార్ వాహన మిత్ర పథకం ప్రవేశ పెట్టడం జరిగిందని, సదరు నగదును వాహన ఫిట్నెస్, నిర్వహణ భారం ఉండకూడదనే సదుద్దేశంతో ఆర్థిక సాయం మంజూరు చేయడం జరిగిందని సదరు నగదును వాహన నిర్వహణ తదితర వాటి కోసం పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని తెలిపారు. అదే విధంగా కరోనా లాంటి కష్టకాలంలో కూడా ప్రభుత్వానికి రావలసిన ఆదాయం లేని పరిస్థితిలో కూడా ఆటో, టాక్సీ, మాక్సీ డ్రైవర్లకు ఏమాత్రం ఇబ్బంది కలగజేయకుండా నేరుగా వారి ఖాతాల్లోకి ఆర్థిక సహాయం జమ చేయడం జరిగిందన్నారు. వైఎస్సార్ వాహన మిత్ర పథకం క్రింద జిల్లాల్లోని ఆటో, టాక్సీ, మ్యాక్సీ, క్యాబ్, యండియు డ్రైవర్ల ఖాతాల్లో వరుసగా ఐదవ విడత ఆర్థిక సాయంగా జమైన నగదు వివరాలు నియోజకవర్గాల వారీగా ఆదోని నియోజకవర్గానికి సంబంధించి 1564 మంది ఆటో, టాక్సీ, మ్యాక్సీ, క్యాబ్ డ్రైవర్ల ఖాతాలో రూ. 1.56కోట్లు, కోడుమూరు నియోజకవర్గానికి సంబంధించి 820 మంది ఆటో,టాక్సీ,మ్యాక్సీ,క్యాబ్ డ్రైవర్ల ఖాతాలో రూ. 82లక్షలు, కర్నూలు నియోజకవర్గానికి సంబంధించి 4748 మంది ఆటో,టాక్సీ,మ్యాక్సీ,క్యాబ్ డ్రైవర్ల ఖాతాలో రూ. 4.74కోట్లు, మంత్రాలయం నియోజకవర్గానికి సంబంధించి 980 మంది ఆటో, టాక్సీ, మ్యాక్సీ, క్యాబ్ డ్రైవర్ల ఖాతాలో రూ. 98లక్షలు, ఆలూరు నియోజకవర్గానికి సంబంధించి 752 మంది ఆటో, టాక్సీ, మ్యాక్సీ, క్యాబ్ డ్రైవర్ల ఖాతాలో రూ. 75లక్షల 20వేలు, పత్తికొండ నియోజకవర్గానికి సంబంధించి 1374 మంది ఆటో, టాక్సీ, మ్యాక్సీ, క్యాబ్ డ్రైవర్ల ఖాతాలో రూ. 1.37కోట్లు, ఎమ్మిగనూరు నియోజకవర్గానికి సంబందించి 1125మంది ఆటో, టాక్సీ, మ్యాక్సీ, క్యాబ్ డ్రైవర్ల ఖాతాలో రూ. 1.12కోట్లు, పాణ్యం నియోజకవర్గానికి సంబందించి 1111 మంది ఆటో, టాక్సీ, మ్యాక్సీ, క్యాబ్ డ్రైవర్ల ఖాతాలో రూ. 1.11కోట్లు రాష్ట్ర ప్రభుత్వం జమ చేసి వారికి అండగా నిలిచిందిని కలెక్టర్ తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ డా.జి.సృజన, కర్నూలు పార్లమెంటు సభ్యులు డాక్టర్ సంజీవ్ కుమార్ చేతుల మీదుగా రూ. 12.47 కోట్ల మెగా చెక్కును ఆటో, టాక్సీ, మ్యాక్సీ, క్యాబ్, యండియు డ్రైవర్లకు అందించారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణమ్మ, రవాణా శాఖ సిబ్బంది, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# నారా లోకేష్‌కు ఊరట




విజయవాడ, సెప్టెంబర్ 29 టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు స్వల్ప ఊరట లభించింది. అక్టోబర్ 4 వరకు అరెస్టు చేయొద్దని ఏపీ హైకోర్టు ఆదేశించింది. స్కిల్ డెవలప్‌మెంట్, ఫైబర్‌నెట్ కేసుల్లో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ శుక్రవారం నారా లోకేష్ లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు అక్టోబరు 4వ తేదీ (బుధవారం) వరకు వాయిదా వేసింది. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో వచ్చే నెల 4 వరకు లోకేశ్‌ను అరెస్ట్ చేయొద్దని నాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.స్కిల్, ఫైబర్ నెట్ కేసులో లోకేష్ పిటిషన్ పై విచారణ వాయిదా వేసింది. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో ముందస్తు బెయిల్ పిటిషన్‌పై వేసిన పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలని హైకోర్టును ఆశ్రయించారు లోకేష్ తరఫు లాయర్లు. దీంతోపాటు ఫైబర్ నెట్ కేసులోను ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు.. మరో వైపు..నారాలోకేష్‌ముందస్తు బెయిల్ పిటిషన్ డిస్పోజ్ చేసింది కోర్టు.బెయిల్ పిటిషన్‌నుతోసిపుచ్చినఏపీహైకోర్టు. విచారణకు సహకరించాలని లోకేష్‌కు కోర్టు ఆదేశించింది. ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసులో లోకేష్‌కు 41ం నోటీసులు ఇచ్చింది.. ఆ నోటీసులను ఇచ్చేందుకు ఢిల్లీ బయల్దేరింది ఏపీ సీఐడీ. లోకేష్‌ను విచారించేందుకు నోటీసులు ఇవ్వనున్నట్లుగా తెలిపింది సీఐడీ. ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో ం14 గా ఉన్నారు నారా లోకేష్. అంతకు ముందు ఇన్నిర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ మార్పునకు సంబంధిం చిన అక్రమ కేసులో ఏపీ హైకోర్టులో శుక్రవారం కీలక పరిణామం చోటు చేసుకుంది.ఈ కేసులో ఏ14గా చేర్చిన నారా లోకేష్ దాఖలు చేసిన ముందస్తుబెయిల్‌పై విచారణసందర్భంగా అడ్వకేట్ జనరల్ కోర్టుకు కీలక విషయాలు వెల్లడించారు. సీఆర్‌పీసీలోని 41ఏ కింద లోకేష్‌కు నోటీసులు ఇస్తామని ఏజీ అన్నారు. దర్యాప్తు అధికారి ఎఫ్ఐఆర్‌లో మార్పు చేశారని కోర్టుకు నివేదించారు. 41ఏ నిబంధనలు పూర్తిగా పాటిస్తామని, విచారణకు సహకరించకపోతే కోర్టు దృష్టికి తీసుకొస్తామని ఏజీ వివరించారు. దీంతో సీఆర్‌పీసీ 41ఏ నోటీసులు అంటే అరెస్ట్ ప్రస్తావన రాదు కాబట్టి ముందస్తు బెయిల్‌పై విచారణను ముగిస్తున్నట్లు న్యాయమూర్తి వెల్లడించారు.

దీనినిబట్టి ముందస్తు బెయిల్‌కు ఆస్కారమున్న అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్లను ఎఫ్ఐఆర్ నుంచి తొలగించి ఉండొచ్చని న్యాయనిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ విషయం నిర్ధారణ కావాల్సి ఉంది. అసలు లోకేష్‌పై ఎఫ్ఐఆర్‌లో ఏ సెక్షన్లు పెట్టారు.. ఏ సెక్షన్లు తీసేశారు.. మళ్లీ ఏ సెక్షన్లు పెట్టారు అన్నది మొత్తం సస్పెన్స్ గానే ఉంది. ఎఫ్ఐఆర్‌లు కూడా లేకుండా అరెస్టులు చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నా అదే పరిస్థితి కనిపిస్తోందంటున్నారు. ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో తెదేపా అధినేత చంద్రబాబు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో వాదనలు కొనసాగుతున్నాయి. ఈ కేసులో చంద్రబాబును సీఐడీ మొదటి నిందితుడిగా పేర్కొంది. బెయిల్ పిటిషన్‌పై ఈనెల 27న వాదనలు జరిగాయి. అనంతరం తదుపరి విచారణను న్యాయమూర్తి నేటికి వాయిదా వేశారు. ఇవాళ వాయిదాల అనంతరం నాలుగో తేదీకి వాయిదా వేశారు. రాజధాని నగరానికి సంబంధించిన బృహత్ ప్రణాళిక డిజైనింగ్, ఇన్నర్ రింగ్‌రోడ్డు, దాన్ని అనుసంధానించే రహదారుల ఎలైన్‌మెంట్‌లో అక్రమాలు చోటు చేసుకున్నాయని వైకాపా ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి 2022 ఏప్రిల్ 27న ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా అదే ఏడాది మే 9న సీఐడీ పలువురిపై కేసు నమోదు చేసింది. చంద్రబాబును మొదటి నిందితుడిగా పేర్కొంది.

# కోడుమూరు అసెంబ్లీలో ప్రభాస్ యోజన కార్యక్రమం



కర్నూలు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 29 విభారె న్యూస్.కర్నూలు జిల్లా అధ్యక్షులు కునిగిరినీలకంఠ ఆదేశాల మేరకు కోడుమూరు అసెంబ్లీ కర్నూలు రూరల్ మండలం గార్గేపురం గ్రామంలో ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా బూత్ కమిటీలు శక్తికేంద్రాలు మండల కమిటీ వివిధ మోర్చాల గురించి ఈసమావేశంలో చర్చించడం జరిగింది. మండల అధ్యక్షుడు శక్తికేంద్రాల బూత్ కమిటీల వివిధ మోర్చాలకు సంబంధించినటువంటి వివరాలు తెలుసుకోవడం జరిగిన ఈకార్యక్రమానికి కర్నూలు రూరల్ మండలం అధ్యక్షులు బెస్తఈరన్న కర్నూల్ రూరల్ మండలం ఇంచార్జ్ మోహన్ రెడ్డి ఓబీసీ మోర్చా జిల్లా కోశాధికారి మహేంద్ర సీనియర్ నాయకులు బైరెడ్డి శంకర్ రెడ్డి మైనార్టీ మోర్చా ఉపాధ్యక్షులు మౌలాలి ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు బాలచందర్ ఎస్సీ మోర్చా ప్రేమనంద్ బి జే వై యమ్ శివనాయుడు మండల అధ్యక్షుడు భూపాన మధు కోడుమూరు అసెంబ్లీ లీగల్ కో కన్వీనర్ శాంతకుమార్ అనురాధ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వేల్పులగోపాల్ తదితర నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

# ఒక రోజు మంచినీటి సరఫరా బంద్....

విభారే న్యూస్ డోన్ ప్రతినిధి:- సెప్టెంబర్ 29 గాజులదిన్నె ప్రాజెక్టు నుండి డోన్ కు వస్తున్న రా వాటర్ పైప్ లైన్ చిట్యాల గ్రామం మరియు అబ్బిరెడ్డిపల్లె చెరువు సమీపంలో పైప్ లైన్ లీక్ అయినట్లు డోన్ మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పైపులైన్ లీక్ అయిన కారణంగా శనివారం డోన్ పట్టణ ప్రజలకు మంచినీటి సరఫరా చేయలేకపోతున్నామని ఆయన తెలిపారు ఆదివారం యధావిధిగా నీటి సరఫరా ఉంటుంది. పట్టణ ప్రజలంతా సహకరించాలని ఆయన కోరారు

# పేదవాడి కుటుంబాల్లో చిరునవ్వు చూడాలి అదే జగనన్న ఆశయం: చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నర్సాపురం సెప్టెంబర్ 29:పేదవాడి ఆర్థిక పరిస్థితులను మెరుగు పరిచేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఇన్ని పథకాలను ప్రవేశపెట్టి అర్హులకు అందిస్తుంది అని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదు రాజు అన్నారు.నరసాపురం నియోజకవర్గం సంబంధించిన 2023--24 సంవత్సరానికి గాను శుక్రవారం అల్లూరి సత్యనారాయణ రాజు సాంస్కృతిక కేంద్రంలో జరిగిన వైయస్సార్ వాహన మిత్ర కార్యక్రమం నాకు రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాద్ రాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు . ముందుగా దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ డా: కె. వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ 2019, ఎన్నికల్లో ప్రకటించిన మేనిఫెస్టో లో భాగంగా వైయస్సార్ వాహన మిత్ర పథకం 2023--24, సంవత్సరమునకు గాను రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల 75 వేల మంది ఆటో, టాక్సీ ,మాక్స్ క్యాబ్, వాహనదారులకు విజయవాడ విద్యా పురం స్టేడియంలో శుక్రవారం జరిగిన బహిరంగ సభ నుండి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బటన్ నొక్కి నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నా రు. నరసాపురం నియోజకవర్గం లో ఐదో విడత వైయస్సార్ వాహన మిత్ర ద్వారా 947 మంది లబ్ధిదారులకు రూ :95,లక్షలు లబ్ధి చేకూరి నట్లు ఆయన అన్నారు. గడిచిన నాలుగున్నర వేళ్ళలో పాదయాత్రలో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన మాట ప్రకారం ఐదు విడతల గా సంవత్సరానికి ఒక్కరికి రూ: 10 వేలు చొప్పున 4176, మంది వాహనదారులు కు రూ:4.కోట్లు17, లక్షలు రూపాయలు వారి బ్యాంకు ఖాతాలో ఈరోజు జమ చేయడం జరిగిందని ఆయన అన్నారు. ఇది కాకుండా పేదవాడికి ఏ విధంగా సహాయం చేస్తే వారి స్థితిగతులు మెరుగుపడతాయి అనే ఆలోచనతో అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన,రైతు భరోసా మత్స్యకార భరోసా చేయూత, రజకులకు, నాయి బ్రాహ్మణులకు, నేత కార్మికులకు, పాస్టర్లకు, లాయర్లకు, కుల మత ప్రాంతం పార్టీ లు తారతమ్యం లేకుండా అన్ని వర్గాల ప్రజలకు నరసాపురం నియోజకవర్గంలో 70 వేల కుటుంబాలకు గడిచిన నాలుగు



సంవత్సరాల కాలంలో రూ :1500 కోట్లు ప్రభుత్వ పథకాలను అందజేసినట్లు ఆయన చెప్పారు. 1వ తేదీ తెల్లవారుజామున వాలంటీర్లు ఇంటికి వచ్చి పెన్షన్ అందిస్తున్నారు అన్నారు ఇంటింటికి వచ్చి రేషన్ అందజేయడం జరుగుతుందన్నారు. అన్ని విధాలుగా ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు వలన ప్రజలు స్థితిగతులు మారి రాష్ట్రం యొక్క వృద్ధిరేటు 15వ స్థానం నుండి 1, వ స్థానానికి వచ్చిందంటే మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే కారణమన్నారు. దేశంలో పక్క రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని చూసి ఆదర్శంగా తీసుకుంటున్నా యని అన్నారు. నరసాపురం నియోజకవర్గం లో రూ:200, కోట్లునిధులతో త్రాగునీరు రోడ్లుకు జరుగుతుందన్నారు. 28 రోడ్లు ప్రతిపాదనలో పెట్టగా 19 రోడ్లు పనులు మొదలు పెట్టి పూర్తి చేయనున్నామని చెప్పారు. ఇంత పెద్ద ఎత్తున ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజలు గమనించాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. అనంతరం వాహనదారులకు వైయస్సార్ వాహన మిత్ర నమూనా చెక్కును అందజేశారు.కార్యక్రమంలో నరసాపురం రాష్ట్ర ఎంబీసీ చైర్మన్ పెండ్ర వీరన్న, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ కె. వెంకటేశ్వరరావు, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఎం వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ,నరసాపురం జ డ్పిటి సి బొక్క రాధాకృష్ణ ,మొగల్తూరు జడ్పిటిసితిరుమనిబాబ్జి, మత్స్యకార సంఘం అధ్యక్షుడు అంద్రారాజుచల్లరావు, బర్రె శంకర్, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.

# భవ్య శ్రీ ని హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

## ప్రజా సంఘాల నాయకుల డిమాండ్



మంత్రాలయం, సెప్టెంబర్,29, (విభారే న్యూస్ ):భవ్య శ్రీ ని అతి కిరాతకంగా మానభంగం చేసి ఆ పై హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వడ్డెర సంఘం గౌరవాధ్యక్షులు వడ్డే నారాయణ జైభీమ్ యంఆర్పియస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు చిక్కం జానయ్య మాదిగ వడ్డెర సంఘం నాయకులు వడ్డే విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినీలతో కలిసి స్థానిక రాఘవేంద్ర సర్కిల్లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిత్తూరు జిల్లా పెనమలూరు మండలం వేణుగోపాల పురానికి చెందిన వడ్డెర భవ్య శ్రీ అనే విద్యార్థిని అతి దారుణంగా ముగ్గురు యువకులు అత్యాచారం చేసి అత్యంత కిరాతకంగా హత మార్చి గుర్తు పట్టకుండా ఉండేందుకు గుండు గీసి కనుబొమ్మలను నాలుకను కోసి చంపడం హేయమైన చర్య అని విమర్శించారు. ఈ సంఘటన జరిగి మూడు రోజులు గడిచినా దీనిపై స్థానిక ఎమ్మెల్యే రోజా కూడా ఒక మహిళగా స్పందించకపోవడం శోచనీయమన్నారు. వైసిపి ప్రభుత్వం మహిళల రక్షణ కోసం ప్రత్యేక దిశ చట్టం తెచ్చారని అది కేవలం అలంకార ప్రాయమైందని ఆరోపించారు. ఇది ప్రభుత్వానికి తీవ్రని మచ్చ అని తెలిపారు. దిశ చట్టం ఏం చేస్తోందని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే ఆ రాక్షసులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ యంఆర్పియస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గర్జి హనుమన్న మాదిగ నాయకులు రత్నం మాదిగ ఉపాధ్యాయినీలు పుష్పలత, సువర్ణ, సుహాసిని, వీణ, సుల్తానా, ఉమామహేశ్వరి పిఇటి నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయంలో ఉచిత వైద్య సేవ శిబిరము.

కర్నూలు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 29 విభారె న్యూస్.శ్రీ శ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ వారి దివ్య ఆశీస్సులతో శ్రీ అనఘా దత్త జ్ఞానబోధ ట్రస్టు వారి ఆధ్వర్యంలో శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయంలో 01.10.2023 ఆదివారం రోజు ఉచిత వైద్య సేవ శిబిరం ను నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 2.00 గంటల వరకు వైద్య సేవ శిబిరము నిర్వహించబడును. ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిథులుగా పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి కార్యక్రమమును ప్రారంభించెదరు. స్థానిక 29వ వార్డు కార్పొరేటర్ ఎన్. సుదర్శన్ రెడ్డి సహకారంతో ఈ కార్యక్రమము నిర్వహించబడును. ఈ వైద్య శిబిరము నందు స్పెషలిస్ట్ వైద్యులు తమ వైద్య సేవలను ఉచితంగా ప్రజలకు అందించనున్నారు. ఈ వైద్య శిబిరంలో అన్ని సాధారణ జబ్బులు, కంటి వ్యాధులు, ఎముకలు, కీళ్ల నొప్పులు, దంత సమస్యలు, స్త్రీ సంబంధ వ్యాధులకు వైద్య పరీక్షలు చేయబడును. 1.డాక్టర్ వై సత్యనారాయణ – జనరల్ సర్జన్,2. డాక్టర్ సి. ఆంజనేయులు – కంటి వైద్య నిపుణులు, 3. డాక్టర్ సి ఏ నాగేష్ – చిన్నపిల్లల వైద్య నిపుణులు, 4. డాక్టర్ వై. కృష్ణమోహన్ – జనరల్ ఫిజీషియన్, 5. డాక్టర్ డి. సిద్ధార్థ రెడ్డి – కీళ్లు,ఎముకల వ్యాధి నిపుణులు,6. డాక్టర్ ఆర్. సుశ్రుత – గర్భిణి, స్త్రీ వ్యాధి నిపుణులు, 7. డాక్టర్ డి. శ్రీనివాసులు – దంత వైద్య నిపుణులు,8. డాక్టర్ డి అముక్త శ్రీ – దంత వైద్య నిపుణులు. తదితర డాక్టర్లందరూ ఈ వైద్య శిబిరంలో పాల్గొని ఉచిత పరీక్షలు చేయుదురు. పరీక్షలు చేసిన రోగులకు సరైన మందులు ఉచితంగా ఇవ్వబడును. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోగలరు

# హృదయాన్ని పదిలంగా చూసుకుంటే మనం ఆరోగ్యంగా ఉంటాము

– హృద్రోగ సమస్యలపై అలసత్వం చేయవద్దు.

– ఎంపీ డాక్టర్ సంజీవ్ కుమార్ వెల్లడి.



కర్నూలు సెప్టెంబర్ 29 విభారె న్యూస్.మన హృదయాన్ని పదిలంగా చూసుకుంటే మనం ఆరోగ్యంగా ఉంటామని అన్నారు కర్నూలు ఎంపీ డా. సంజీవ్ కుమార్.వరల్డ్ హార్ట్ డేని పురస్కరించుకొని కిమ్స్ హాస్పిటల్ కర్నూలు వారి ఆధ్వర్యంలో 2కె వాక్ నిర్వహించారు. ఈ వాక్ లో కర్నూలు ఎంపీ డా. సంజీవ్ కుమార్, వైకాపా డాక్టర్స్ విభాగం జనరల్ సెక్రటరీ ఆదిమూలపు సతీష్,17వ వార్డ్ కార్పొరేటర్ పద్మలత, సుబ్బారెడ్డి విద్యాసంస్థల ఛైర్మన్ సుబ్బారెడ్డి,కిమ్స్ కర్నూలు సిఓఓ డా.సునిల్ సేపూరి, మార్కెంటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.ఈ వాక్ రాజ్ వీహార్ లో సర్కిల్ లో ప్రారంభమై కలెక్టర్ కార్యాలయం వరకు కొనసాగింది.ఈ సందర్భంగా ఎంపీ సంజీవ్ కుమార్ మాట్లాడారు. మారుతున్న జీవనశైలికి తగ్గట్లు మన ఆహార అలవాట్లు మార్చుకోవాలని సూచించారు. మన కోసం నిరంతరం పనిచేస్తున్న గుండె కోసం మనం ప్రతి రోజు ఒక గంట సమయాన్ని కేటాయించి తప్పకుండా చురుకైన నడక,వ్యాయామం చేయాలని తెలిపారు. ఐ,పీఆర్ కర్నూలు డిప్యూటీ డైరెక్టర్ కె. జయమ్మ సహకారంతో జర్నలిస్టుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత గుండె వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా కిమ్స్ హాస్పిటల్స్ గుండె వైద్య నిపుణులు డా.నాగేంద్ర ప్రసాద్ మాట్లాడారు. హృద్రోగ సమస్యలపై అలసత్వం చేయవద్దని సూచించారు.ఆయన విలేకరులకు వైద్య పరీక్షలు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడారు.అనేక ఆరోగ్య సమస్యలు అందరినీ ఇబ్బంది పెడుతున్నాయి.తక్కువ వయసు గలవారు ప్రధానంగా గుండె సంబంధిత సమస్యల వల్ల ప్రాణాలు కొల్పోతున్నారు. నిత్యం సమయానికి ఆహారం తీసుకోకపోవడం, మితిమీరిన ఆల్కాహాల్, జంక్ఫుడ్స్,కొవ్వు పదార్థాలు అధికంగా తీసుకుంటున్నారు.పైగా సరైన నిద్రసమయాలను కూడా పాటించడం లేదు. దీని వల్ల గుండె చుట్టూ కొవ్వు పేరుకపోతోంది. 'హృదయాన్ని ఉపయోగించండి, హృదయాన్ని తెలుసుకోండి' అనే థీమ్ తో ఈ సంవత్సరం ఈ వరల్డ్ హార్ట్ డే నిర్వహిస్తున్నామని తెలిపారు.దీని వల్ల హార్ట్ఎటాక్, ప్రధాన రక్తనాళ సమస్యలు వస్తున్నాయి. అలాగే ఈ మధ్యకాలంలో అధికంగా జిమ్ చేయడం వల్ల కూడా ప్రాణాలు కొల్పోతున్నారు. ఇటీవల కాలంలో సినీ ప్రముఖులు, రాజకీయవేత్తలు మరణాలు కూడా మనం చూశాం. మితంగా ఏదీ చేసినా... ఇబ్బందే. కాబట్టి ప్రతి ఒక్కరూ వైద్యుల పర్యవేక్షణలో నడుచుకోవాలి.క్రమ తప్పకుండా నిత్యం వ్యాయామం, వాకింగ్ చేయడం ఉత్తమం.దీని వలన అనేక ఆరోగ్య సమస్యలకు చెక్ పెట్టవచ్చు. బిపి, బరువును అదుపులో ఉంచుకోవాలి. ఛాతీలో నొప్పి రావడం, అధికంగా చెమటలు పట్టడం, కొద్దిదూరం నడిచినా..ఆయాసం రావడం వంటి క్షణాలు కనిపిస్తే తప్పకుండా వైద్యుల వద్దకు వెళ్లాలి. ప్రధానంగా చెప్పుకోవాలంటే విలేకరుల జీవినశైలిఅందరికంటే విభన్నంగాఉంటుంది. వారు ఏ సమయంలో ఎక్కడ ఉంటారో వారికే తెలియదు. కాబట్టి మీరు అందరూ కూడా ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. ఆహార నియమాలు తప్పనిసరిగా పాటించాలి.ఈ కార్యక్రమంలో కర్నూలు పట్టణానికి చెందిన ప్రింట్ టీవి ఛానెల్లకు సంబంధించిన విలేకరులు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

# మండల స్థాయి స్పందనకు 75 దరఖాస్తులు



## జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి

నంద్యాల మా ప్రతినిధి , సెప్టెంబర్ 29:విభారె న్యూస్ :–రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో వారంలో ప్రతి బుధ, శుక్రవారాలు మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం – స్పందన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల నుండి వివిధ సమస్యలపై దరఖాస్తులు స్వీకరిస్తున్నామని జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహించిన మండల స్థాయి స్పందనలో ప్రజల నుండి వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మండల స్థాయి స్పందనలో స్వీకరించిన దరఖాస్తులను వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో వారంలో ప్రతి బుధ, శుక్రవారాలు మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం – స్పందన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు మండల స్థాయి స్పందన కార్యక్రమంలో పాల్గొని పరిష్కరించదగ్గ సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మండల స్థాయి స్పందనలో రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించిన దరఖాస్తులు అధికంగా వస్తున్నాయని వీటన్నింటిని నిర్ణీతకాల పరిమితిలోగా పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు జెసి వివరించారు.నంద్యాల మండల స్థాయి జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో 75 దరఖాస్తులు వచ్చాయని వీటన్నింటిని బియాండ్ ఎస్ఎల్ఎ లోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు. డిఆర్ఓ పుల్లయ్య, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, ఇతర జిల్లా అధికారులు స్పందన కార్యక్రమంలో పాల్గొన్నారు.మండల స్థాయి స్పందనలో కొన్ని వినతులు×1) చాగలమర్రి మండలం చిన్న బోధనం గ్రామ కాపురస్తురాలు రమణమ్మ తన అక్కకు నంద్యాల మండలం పెద్దకొట్టాల గ్రామంలో సర్వే నంబర్ 256 లో 1.40 సెంట్ల భూమి వుందని... ప్రస్తుతం ఆమె చనిపోయిందని సంబంధిత భూమి హైవే రోడ్డుకు కేటాయించారని సంబంధిత పరిహారం మొత్తాన్ని మా బావగారికి చెందకుండా సివిల్ జడ్జి కోర్టులో డిపాజిట్ చేపించవలసినదిగా కోరుతూ జిల్లా జాయింట్ కలెక్టర్ కు దరఖాస్తును సమర్పించుకున్నారు.2) నంద్యాల మండలం పెద్ద కొట్టాల గ్రామానికి చెందిన తలారి ఎల్లమ్మ తన భర్త అనారోగ్యం కారణంగా చనిపోయారని.... రైస్ కార్డ్ నుండి ఆయన పేరును తొలగించి నా కుమార్తె ఆధార్ నంబర్ సరిచేసి నాకు పెన్షన్ అప్లై చేసుకొనుటకు సహకరించగలరని కోరుతూ జిల్లా జాయింట్ కలెక్టర్ కు దరఖాస్తు ను సమర్పించుకున్నారు.

# ఆర్యవైశ్య విద్యార్థినీ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు.

ఎమ్మిగనూరు సెప్టెంబర్ 29 విభారె న్యూస్.ప్రతి సంవత్సరము మాదిరిగానే ఈ సంవత్సరము కూడా 2022–2023 విద్యా సంవత్సరము నందు 10వ తరగతి, ఇంటర్, డిగ్రీతో పాటు బీటెక్., ఎం. టెక్, ఎంబీఏ., ఎంసీఏ, మరియు పీ.జీ. నందు ప్రతిభావంతులైన విద్యార్థినీ, విద్యార్థులకు ప్రథమ బహుమతి, ద్వితీయ తృతీయ బహుమతి ఇవ్వబడును. ఎంబీబీఎస్., ఫ్రీ సీటు సాధించిన విద్యార్థులకు మరియు సి.ఏ., ఐ సి డబ్ల్యూ ఏ., పూర్తిచేసిన విద్యార్థులకు కూడా బహుమతి ప్రధానము చేయబడును. అర్హతగల అభ్యర్థులు దరఖాస్తు ఫారముతో పాటు మార్కుల జాబితా నకలు (జిరాక్స్ కాఫీ) పాస్ పోర్టు సైజు ఫోటో జతపరిచి తేది. 1–10–2023 ఆదివారం సాయంత్రం 6 గంటలలోపు ఈ క్రింద కనపరిచిన అడ్రస్సు వారికి ఇవ్వవలసినదిగా కోరడమైనది.దరఖాస్తు ఫారములు ఈ క్రింది అడ్రస్సులలో లభించును.అడ్రస్సుపాండురంగ ఫ్యాన్సీ స్టోర్స్ షాప్ నం. బి–15, మునిసిపల్ బిల్డింగ్స్, ఎమ్మిగనూరు. సెల్: 9652835641.సాయిరాం టెక్స్టైల్స్ షాప్ నం. బి–3, మునిసిపల్ బిల్డింగ్స్, ఎమ్మిగనూరు. సెల్: 9440595593.

# వైఎస్సార్ బీమా నగదు అందజేత



మంత్రాలయం , సెప్టెంబర్,29,( విభారే న్యూస్ ): మండల పరిధిలోని చెట్నేహళ్లి గ్రామానికి చెందిన బెస్త బాబు గుండె పోటు తో మరణించారు. మృతుడికి వైఎస్సార్ బీమా పథకం నమోదు కావడంతో తక్షణ సహాయం కింద రూ 10 వేల నగదును ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు గ్రామ సర్పంచ్ అంజినప్ప, ఉప సర్పంచ్ వీరనాగప్ప, నాయకులు గంగుల మల్లికార్జున చేతుల మీదుగా మృతుడి కుటుంబ సభ్యులకు అందించారు.

# ప్రభుత్వ వైద్యశాలకు 40 దుప్పట్ల అందజేత



ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 29 విభారె న్యూస్ :– కీ.శే. ఎలికంటి సుబ్బయ్య 43వ వర్ధంతి సందర్భంగా బౌద్ధ రామ సేవా సమితి పడకండ్ల వారి ఆధ్వర్యంలో వీరి కుమారులు జ్ఞాపకార్థం మన ఆళ్లగడ్డ గవర్నమెంట్ హాస్పిటల్ నందు 40 దుప్పట్లు ఆసుపత్రి సూపరిండెంట్ డా. సుజాత, హాస్పిటల్ సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ దామోదర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, వజ్రాలు, మురార్జీ,గోపాల్, మార్కండేయ, నారాయణ, హరినాథ్, మద్దిలేటి, నాగేషు, పుల్లయ్య, నాగరాజు, రామసుబ్బయ్య, రుద్రమూర్తి, నారమ్మ, నారాయణమ్మ, బౌద్ధ రామ సేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

# పండ్ల తోటలను పరిశీలించిన అధికారులు

ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 29 విభారె న్యూస్:– మండలంలోని కోటకందుకూర్, ఆర్ కృష్ణాపురం గ్రామాలలో హార్టికల్చర్ తోటలను శుక్రవారం అంబుడ్స్ పర్సన్ డాక్టర్ సురేంద్ర కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో, ఉపాధి కూలీలతో ఉపాధి హామీ పథకం గురించి చర్చించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయములో ఉపాధి సిబ్బంధితో సమావేశము నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ ఉపాధి హామీ పథకంలో కూలీలకు, రైతులకు ఇబ్బంది లేకుండా వారికి కనీస వేతనం అందే విధంగా పనులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమములో ఎపిఓ గణేష్, ఈసీ రంగయ్య, టెక్నికల్ అసిస్టెంట్లు హుస్సేనయ్య, లత తో పాటు ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు .



# కళ్లకు గంతలు కట్టుకొని రిలే నిరాహార దీక్ష...

## "సైకో" పోవాలి, "సైకిల్" రావాలి అంటూ నినాదాలు చేస్తూ నిరసన నారా చంద్రబాబు నాయుడు గారిని విడుదల చేయాలంటూ నినాదాలు చేపట్టిన టిడిపి నాయకులు





విభారే న్యూస్ డోన్ ప్రతినిధి:– సెప్టెంబర్ 29 శుక్రవారం రోజు నారా చంద్రబాబు నాయుడు గారి అక్రమ అరెస్ట్ పై బాబు తో మేము సైతం అంటూ... ప్యాపిలి మండలం, మెట్టుపల్లె, ఏనుగుమర్రి , ఊటకొండ గ్రామ టిడిపి నాయకులు, రైతులు, ప్రజలు "రిలే నిరాహారదీక్షలో" కూర్చున్నారు.ఈ దీక్ష కార్యక్రమం ప్యాపిలి మండలం టిడిపి అధ్యక్షులు గండికోట రామసుబ్బయ్య క్లస్టర్ ఇంచార్జ్ మెట్టుపల్లె సుదర్శన్ అధ్యక్షతన వహించారు .డోన్ నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి, రాష్ట్ర తెలుగుదేశంపార్టీ కార్యదర్శి వలసల రామకృష్ణ దీక్షలో కూర్చున్నా వారికి సంఘీభావం తెలిపారు. అదేవిధంగా నల్ల రిబ్బన్ కళ్ళకు కట్టుకొని వినూతన నిరసన చేపడుతూ "సైకో" పోవాలి "సైకిల్" రావాలి అంటూ నినాదాలు చేశారు.దీక్షలో కూర్చున్నా వారు:క్లస్టర్ ఇంచార్జ్ సుదర్శన్, తెలుగుయువత నాయకులు రాంభూపాల్, రామారావు , పుల్లారెడ్డి, భాస్కర్, సిద్దారెడ్డి ,సూర్యనారాయణ గౌడ్ , సురేష్ చంటీ, కృష్ణుడు ,శ్రీనివాసులు, మాబు, సాయి కుమార్ , మోదిసాహెబ్ ,కుమార్ ,హరి , చక్రవర్తి, నవీన్, కార్తీక్, మల్లి, రాజేష్, సంఘీభావం తెలిపిన వారు:డోన్ నియోజకవర్గ టిడిపి సలహాదారుల కమిటీ అధ్యక్షులు మురళీకృష్ణ గౌడ్, డోన్ మండలం టిడిపి అధ్యక్షులు సలీంద్ర శ్రీనివాసులు యాదవ్, నంద్యాల జిల్లా టిడిపి సలీంద్ర శ్రీనివాసులు యాదవ్, నంద్యాల జిల్లా టిడిపి బీసీ సెల్ అధ్యక్షులు ప్రజావైద్యశాల బెస్తా మల్లిఖార్జున, పట్టణ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ రఫీ, గోవిందరెడ్డి మరియు డోన్ నియోజకవర్గ టిడిపి నాయకులు, కార్యకర్తలు సంఘీభావం తెలిపారు

# నేటి నుండి జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపులు

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబర్ 29 విభారె న్యూస్:–ఈనెల 30 నుండి జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపులు ప్రారంభమవు తాయని మున్సిపల్ కమిషనర్పత్రిక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 30న శిల్పా కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ నందు శిల్ప కాలనీ 1, రాఘవేంద్ర కాలనీ, శిల్ప కాలనీ, గాంధీ నగర్ 2, శిల్ప కాలనీ 2, వెంకటాపురం, ఎమ్మెస్ నగర్ 1, వార్డు ప్రజలకు ఆరోగ్య పరీక్షలు ఉంటాయని అక్టోబర్ మూడు కిబలా క్వార్టర్స్ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో హరిజనవాడ 2, వడ్డే సంఘం ఏరియా, వడ్డే కాలనీ సున్నంబట్టి వీధి, గిబ్సన్ కాలనీ 1, కిబిలా కాలనీ 1, గిబ్సన్ కాలనీ 2 వార్డు ప్రజలకు అక్టోబర్ 5 న సంజీవయ్య నగర్ అర్బన్ సెంటర్ నందు కిబూలా కాలనీ 2, ఇందిరానగర్, హెచ్.బి.ఎస్ కాలనీ, గాంధీ నగర్ 1, ఎంఎస్ నగర్ 2, ఎంఎస్ నగర్ 3, లక్ష్మీపేట వాసులకు ఆరోగ్య పరీక్షలు ఉంటాయని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు

# నాటు సారా సీజ్ చేసిన ఎక్సైంజ్ అధికారులు....

విభారే న్యూస్ డోన్ ప్రతినిధి:– సెప్టెంబర్ 29 ప్యాపిలి మండలములోని బావిపల్లి గ్రామము వద్ద 100 లీటర్ల నాటు సారాయి సీజ్ చేసినట్లు ఎక్సైంజ్ ఎస్పై భీమ లింగం శుక్రవారం స్థానిక ఎక్సైంజ్ ఆఫీసులో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సారా తీసుకొస్తున్న ఈడిగ సుంకన్న అను వ్యక్తిని అరెస్ట్ చేసి విచారించగా అతడు. ప్యాపిలి మండలము సీతమ్మ తానీడా కు చెందిన మూడావత్ రాముడు నాయక్ అను వ్యక్తి నుండి తీసుకు వస్తున్నానని తెలపడం జరిగింది. తదుపరి రాముడు తన వ్యక్తిని కూడా అరెస్టు చేసి వారి ఇరువురిపై కేసు రిజిస్టర్ చేసి, పట్టుబడిన ముద్దాయిలను జే ఎఫ్ ఎం సి డోన్ వారి ముందర హాజరు పరిచి రిమాండ్ కు తరలించినట్లు ఆయన తెలిపారు .



## పట్టణాన్ని స్వచ్ఛంగా తీర్చిదిద్దుదాం..: మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రఘు.





ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబర్ 29 విభారె న్యూస్:- ఎమ్మిగనూరు పట్టణాన్ని స్వచ్ఛంగా తీర్చిదిద్దాలని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రఘు పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా ఇండియా వర్సెస్ గార్బేజ్ ఫ్రీ నిమున్సిపల్‌కౌన్సిలర్లు, అధికారులు, ఎన్ఎస్ఎస్, స్కౌట్ విద్యార్థులు,వ్యాపారులు కలసి మున్సిపల్ కార్యాలయం నుండి ర్యాలీ చేశారు. స్థానిక తారక రామ మున్సిపల్ కూరగాయల మార్కెట్ నందు శానిటేషన్ పనులు చేశారు. అనంతరం రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. స్వచ్ఛమైన ఎమ్మిగనూరును సాధించడంలో అందరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్మన్ రఘు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డి. ఈ. మనోహర్ రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డి. వై. ఎఫ్.ఐఆధ్వర్యంలో వ్యాసరచన పోటీ



ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబర్ 29 విభారెన్యూస్:-జాతీయ సమైక్యత మతసామరస్యం పై మహాత్మా గాంధీ చేసిన కృషి అనే అంశంపై డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రభుత్వ బాలికల కళాశాల యందు వ్యాసరచన పోటీని నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ నాయకుడు అజిత్ మాట్లాడుతూ దేశంలో మతోన్మాదం నిండిపోయింది అన్నారు బ్రిటిష్ ప్రభుత్వ హాయంలోనే మతోన్మాదానికి బీజం పడిందని, అప్పట్లోనే ఈ వాదానికి వ్యతిరేకంగా మహాత్మా గాంధీ పోరాడన్నరు. అందుకే ఆయనను ఆర్ఎస్ఎస్ వాది అయిన గాడ్సే హత్య చేశారన్నారు. ప్రస్తుతం బిజెపి ప్రభుత్వం అదే వాదాన్ని ప్రజల్లో నింపి మతాల మధ్య చిచ్చు పెడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## వొకేషనల్ విద్యార్థుల ప్రతిభ సిల్వర్ జూబిలి కళాశాలలో



కర్నూలు, సెప్టెంబర్ 29 విభారె న్యూస్ :కర్నూలు జిల్లా టూరిజం డిపార్ట్ మెంట్ ఆఫీసర్ పి . విజయ ఆధ్వర్యంలో " ప్రపంచ పర్యాటక దినోత్సవ " వేడుకలు గురువారం నాడు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కలెక్టర్ జి . సృజన మరియు మేయర్ బి .వై . రామయ్య పాల్గొన్నారు. కార్యక్రమం లో భాగంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనబర్చిన ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇద్దరికి మరియు వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనబర్చిన ఏడుగురు విద్యార్థులకు కలెక్టర్ జి . సృజన ప్రసంశా పత్రాలను అందజేశారు. పర్యాటక నేపథ్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంత గానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమం లో వొకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ . నాగస్వామి నాయక్ మరియు లెక్చరర్స్ విజయశేఖర్, లక్ష్మి, సుజాత, గిరిజారాణి , పార్థసారథి పటేల్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆయుష్మాన్ భారత్ 72 మందికి హెల్త్ కార్డులు పంపిణీ చేసిన కౌన్సిలర్ నాగిని రవి సింగారెడ్డి



నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 29 విభారె న్యూస్ ..నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 36వ వార్డులో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఆయుష్మాన్ భరత్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 72 మంది కి హెల్త్ కార్డులను కౌన్సిలర్ నాగిని రవి సింగారెడ్డి పంపిణీ చేశారు. ముఖ్యంగా పేదవారికి ఆరోగ్య సమస్యల వల్ల ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు . అందులో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో మాత్రమే ఆరోగ్యశ్రీ ద్వారా చేయించుకోవడానికి వీలుగా ఉంటుందని కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ఈ హెల్త్ కార్డు ను దేశం లో ఉన్న నిర్దేశిత జాబితాలో ఉన్న ఆసుపత్రులలో పైసా ఖర్చు లేకుండా ఎక్కడైనా ఆరోగ్య సమస్యల వల్ల ఉన్నవారు చూపించుకోవడానికి వీలుగా ఉంటుందని తెలియజేశారు. ఈ సందర్భంగా 36 వ వార్డు కౌన్సిలర్ నాగిని రవి సింగారెడ్డి మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం ద్వారా 36 వ వార్డులో ఆర్థికంగా నిరుపేదలైన ఉన్న 72 మంది కి హెల్త్ కార్డులను పంపిణీ చేయడం జరిగిందని అర్హులైన ప్రతి ఒక్కరు నిర్దేశిత హాస్పిటల్స్ నందు ఈ కార్డును ఉపయోగించుకోవచ్చని అలాగే రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆరోగ్యశ్రీ ద్వారా ఎంతో మంది పేదవారికి నాణ్యమైన ఆరోగ్య సేవలందిస్తున్నారని అలాగే కేంద్ర ప్రభుత్వం కూడా దేశం లో ఎక్కడైనా నిర్దేశిత జాబితాలో ఉన్న హాస్పిటల్ నందు ఆయుష్మాన్ భారత్ ద్వారా ఇస్తున్నా కార్డును ఉపయోగించు కోవచ్చు అన్నారు ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది వాలంటరీలు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## 12 మంది టిడిపి అభ్యర్థులను సంతలో పసువులను కొన్నట్టు కొన్నాము": వైస్ చైర్మన్ పాంషావలి

నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 29 విభారె న్యూస్ :- టిడిపి కౌన్సిలర్ మాహబూబ్ వలి మున్సిపల్ స్థలాలు కబ్జాకు గురైనట్లు తెలుపుతుండగా వైస్ ఛైర్మన్ అడ్డు తగలడంతో ఇరువురు మధ్య మాటల యుద్ధం నడిచింది . టిడిపి కౌన్సిలర్ మహబూబ్ వలి మాట్లాడుతూ వైస్ చైర్మన్ పాంషావలి పోటి చేయడం చేతగాక రాజీ మార్గం ద్వారా ఎన్నిక అయినావు అని అనడంతో వైస్ చైర్మన్ పాంషావలి టిడిపి వారు తనపై పోటీ చేయడానికి చేత కాక బేరాలకు వచ్చారని మా పెద్దాయన మా ఎమ్మెల్యే మేము 12 మంది టిడిపి అభ్యర్థులను సంతలో పశువులను కొన్నట్టు . కొన్నామని అవేశంగా అనడంతో 36 వార్డు కౌన్సిలర్ నాగిని రవిసింగారెడ్డి వైస్ చైర్మన్ పాంషావలికి సర్ది చెప్పడంతో సభ ప్రశాంతంగా సాగింది . శుక్రవారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఛైర్ పర్సన్ మహాబున్నిసా అధ్యక్షతనతో కమిషనర్ రవిచంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగినది. కౌన్సిల్ సమావేశంలో . అజెండాలోని అంశాలను కౌన్సిలర్లకు అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్ చదివి వినిపించారు. అజెండా లోని అంశాలపై ఎటువంటి అభ్యంతరం లేక పోవడంతో ఛైర్ పర్సన్ మాబున్నిసా ఆమోదం తెలిపారు. వార్డు సమస్యల పై 12 మంది కౌన్సిలర్లు గళం విప్పారు. మిగతా కౌన్సిలర్లు వార్డు సమస్యలపై నోరు మెదపలేదు. 12 మంది అడిగిన సమస్యలను ఛైర్ పర్సన్ మహాబున్నిసా మున్సిపల్ కమిషనర్ రవి చంద్రా రెడ్డి సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని సభలో తెలిపారు. కమిషనర్ రవిచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ను జయప్రదం చేయాలని సూచించారు..



ఇండిపెండెంట్ అభ్యర్థి ఖండే శ్యామ్ సుందర్ లాల్ మాట్లాడుతూ ఎన్‌టీఆర్‌కాంప్లెక్స్‌లో ఉన్న సమస్యలను స్వయంగా పరిశీలించాలని ఛైర్ పర్సన్ మహాబున్నిసా ను కోరారు. అలాగే అవులు పట్టణంలో ఇబ్బందులు పడుతున్నాయని వాటిని గోషాలకు తరలించాలని కోరారు .అదేవిధంగా అదికార కౌన్సిలర్లు తమ వార్డులలో కూడా పనులు జరగలేదని అసహనం వ్యక్తం చేశారు. కౌన్సిలర్లు అడిగిన ప్రశ్నలకు ఛైర్ పర్సన్ మాబున్నిసా సమాధానం ఇచ్చారు. అన్ని వార్డుల్లో పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాస్, ఎంఇఇ రమణమూర్తి, డీఈలు జయ భరత్ రెడ్డి. మదు కుమార్. శ్రీనివాసులు రెడ్డి . టౌన్ ప్లానింగ్ అధికారి నరసింహ మూర్తి , హెల్త్ ఆఫీసర్ అంకిరెడ్డి, శానిటేషన్ సూపరైజర్ లక్ష్మినారాయణ, శివప్రసాద్ రెడ్డి ,, తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిగత స్వేచ్ఛను హరిస్తున్న పోలీసుల వైఖరిని ఖండించండి -డివైఎఫ్ఐ

కర్నూలు, సెప్టెంబర్ 29 విభారె న్యూస్ : రాష్ట్రంలో ప్రజా సమస్యలపై ప్రజా సంఘం,కానీ ప్రజలు కానీ వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి చిన్నపాటి నిరసనలు తెలపడానికి ప్రకటించిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాటను తుంగలో తొక్కి ప్రజా సంఘాల నాయకులను ప్రజలను ఎక్కడికక్కడే ఇళ్ల దగ్గర పోలీస్ స్టేషన్ లలో నిర్బంధించడం అంటే వ్యక్తిగత స్వేచ్ఛను హరించడమే అని డివైఎఫ్ఐ కర్నూలు న్యూసిటీ కార్యదర్శి ఎస్ . హుస్సేన్ భాష ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం రాత్రి కర్నూలు ఫోర్త్ టౌన్ పోలీసులు ఆయనకు నోటీసులు అందజేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం 30వ తేదీన ఎస్ ఎఫ్ ఐ ఛలో విజయవాడ కార్యక్రమనికి పిలుపునిస్తే రెండు రోజుల ముందు నుండే నోటీసులు ఇవ్వడం దుర్మార్గమైన చర్య అయన విమర్శించారు.ఎస్ ఎఫ్ ఐ కార్యక్రమానికి మద్దతు తెలపకుడదని పోలీసులు నోటీసులు ఇవ్వడం అంటే వ్యక్తిగత స్వేచ్ఛను హరించి ప్రజాస్వామ్యాన్ని కూని చేయడమే అని తెలిపారు. ప్రభుత్వం,పోలీసులు రోజు రోజుకు పెట్రేగిపోతున్న డ్రగ్స్ మాఫియా,మహిళలను అక్రమంగా విక్రయించే వారిపైన,మహిళలపై అత్యాచారాలు, హత్యలకు పాల్పడే వారిపైన,దళితులు, గిరిజనులపై దాడులకు దౌర్జన్యాలకు పాల్పడుతున్న వారిని గాలికి వదిలేసారని, ప్రభుత్వ పెద్దలు,పోలీసు ఉన్నతాధికారులు హస్తంతో డ్రగ్స్ మాఫియా రెచ్చిపోయి విచ్చలవిడిగా రాష్ట్రన్ని మత్తు ఆంధ్రప్రదేశ్ గా మారుస్తున్నా పట్టించుకునే నాధుడే లేదాని అయన విమర్శించారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి భారీగా పెరిగిన నిరుద్యోగ సమస్య, పరిష్కారం చేయాలని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద, రాష్ట్ర కేంద్రంలో శాంతియుతమైన ధర్నాలకు పిలుపునిస్తే వెంటనే ఆయా సంఘాల నాయకులను ముఖ్యమైన కార్యకర్తలను నిర్బంధించడం సరైన పద్ధతి కాదు అని తెలిపారు.ఆంధ్రప్రదేశ్



ను నిర్బంద ఆంధ్రప్రదేశ్ గా మారుస్తున్నారని ఎద్దేవా చేశారు. కావున ప్రభుత్వం తక్షణమే నిరుద్యోగులకు,చిన్న ఉద్యోగులకు ఇచ్చిన మాటని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. నేటి యువతను తప్పుడు దారిలో నడిపిస్తున్న డ్రగ్స్ మాఫియాపై మహిళల అక్రమ విక్రయుదారులపై ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న లైంగిక వేధింపులకు పాల్పడుతున్న వారి పైన దళితులు గిరిజనులపై దాడులకు దౌర్జన్యాలకు పాల్పడుతున్న వారి పైన ఉక్కు పాదం మోపాలని అయన తెలిపారు.

## "పోలీసు గ్రీవియన్స్ డే కు నాలుగు అర్జీలు".

నంద్యాల జిల్లా ఎస్పీ కె . రఘువీర్ రెడ్డి



నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 29 విభారె న్యూస్ :-పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారం కొరకు శుక్రవారం నంద్యాల జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు గ్రీవియన్స్ డే నిర్వహించారు. జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లు ఆయా విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న 04 మంది పోలీసు సిబ్బంది వారి మ్యూచువల్ ట్రాన్స్ఫర్, మెడికల్ గ్రౌండ్స్, రిక్వెస్ట్ బదిలీల గురించి జిల్లా ఎస్పీ గారికి స్వయంగా విన్నవించుకున్నారు. జిల్లా ఎస్పీ గారు సిబ్బంది సమస్యలను విని, వారి సమస్యలకు తగిన పరిష్కారం చూపుతామని సిబ్బందికి భరోసా కల్పించారు.పోలీస్ సిబ్బంది సంక్షేమానికి తగిన ప్రాధాన్యత ఇస్తూ సిబ్బంది సమస్యల పరిష్కరానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ప్రతి శుక్రవారం నిర్వహించే పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమంలో సిబ్బంది వారి సమస్యలను నిర్భయంగా తెలియజేసుకోవచ్చని జిల్లా ఎస్పీ గారు తెలిపారు. విధినిర్వహణలో సిబ్బంది సతమత పడకుండా వారి సమస్యల తొలగించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చెయ్యుటవే లక్ష్యమని తెలియచేసినారు.

## ప్రపంచ హృదయ దినోత్సవ సందర్భంగా జీవిత సాఫల్య పురస్కారం







కర్నూలు, సెప్టెంబర్ 29 విభారె న్యూస్ :ప్రపంచ హృదయ దినోత్సవ సందర్భంగా జీవిత సాఫల్య పురస్కారం నాకు అందించిన పెద్దలకు కృతజ్ఞతలు..ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు రామకృష్ణారెడ్డి , మరియు జన విజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్షులు శ్రీ వెన్నపూస బ్రహ్మానంద రెడ్డి , శ్రీ తరిమెల అమర్నాథ్ రెడ్డి , మానవతా స్వచ్ఛంద సంస్థ అనంతపురం వారు, తెలుగు వెలుగు స్వచ్ఛంద సేవా సంస్థ అనంతపురం వారు.. డాక్టర్ వెంకట రంగారెడ్డి ప్రభుత్వ సర్వజన వైద్యశాల కర్నూలు సూపర్డెంట్ గారు మరియు ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్ ఈ సభలో పాల్గొని పురస్కారం అందించినందుకు వారికి సర్వదా కృతజ్ఞుణ్ణి.. అలాగే నాకు సహాయ సహకారాలు అందించిన మా వైద్య బృందము, నర్సింగ్ సిబ్బంది, సపోర్టింగ్ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది అందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు

## వరల్డ్ హార్ట్ డే సందర్భంగా సిటివిఎస్ వార్డు -గుండె ఊపిరితిత్తుల శస్త్ర చికిత్స వార్డ్ పత్రిక సమావేశం ఏర్పాటు చేయబడింది..

కర్నూలు, సెప్టెంబర్ 29 విభారె న్యూస్ : మేము ఎంతో మందికి ఆపదలో ఉన్న వారికి గుండె ఆపరేషన్లు చేస్తుంటాము.. కానీ చాలామంది థాంక్స్ కూడా చెప్పారు.. కొందరూ ఎంత చేసినా ఇంకా విమర్శిస్తూనే ఉంటారు.. అటువంటిది పని కట్టుకొని అనంతపురం నుంచి ఇక్కడికి వచ్చి కొంతమంది స్వచ్ఛంద సేవా సంస్థ మరియు పౌర సమాజ సభ్యులు మాకు తమ కృతజ్ఞతలు తెలియజేయాల అనుకుంటున్నారు.. ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు రామకృష్ణారెడ్డి , మరియు జన విజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్షులు శ్రీ వెన్నపూస బ్రహ్మానంద రెడ్డి , శ్రీ తరిమెల అమర్నాథ్ రెడ్డి మానవతా స్వచ్ఛంద సంస్థ అనంతపురం వారు, తెలుగు వెలుగు స్వచ్ఛంద సేవా సంస్థ అనంతపురం వారు అతిథులుగా వస్తున్నారు.. డాక్టర్ వెంకట రంగారెడ్డి ప్రభుత్వ సర్వజన వైద్యశాల కర్నూలు సూపర్డెంట్ మరియు ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్ ఈ సభలో పాల్గొంటారు అధ్యక్షత వహిస్తారు..




EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**